# కుర్రాళ్ల వెబ్‌సైట్.. కాలేజీల్లో హిట్!



గ్రాఫిక్: సుధాకర్

**ఈతరం**

**మొదలై ఏడాది కాకముందే 20 లక్షలమంది వీక్షకులు.. ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ఎన్ఐటీలతో భాగస్వామ్యం.. నెలకు మూడు లక్షల కొత్త క్లిక్స్..ఇది విద్యార్థులకిష్టమైన ఓ వెబ్‌సైట్ ప్రస్తావన.. వ్యవస్థాపకులు పాతికేళ్లలోపు ముగ్గురు యువకులు! పలకరించిన 'ఈతరం'తో పంచుకున్న అనుభవాలివిగో...**

ముగ్గురు కుర్రాళ్లు.. అందర్లాగే సరదాలు, షికార్లంటే చాలా ఇష్టం. కానీ ఆలోచనలే కాస్త భిన్నం. అందుకే ఓ వెబ్ సైట్ మొదలు పెట్టారు. ఏడాది కాకముందే అనూహ్య విజయం. ఆ సైట్ ద్వారా ఇప్పుడు లక్షలమంది ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు కాలేజీల్లో ప్రవేశ, ఉద్యోగ సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. అదే www.collegekabhar.com

## ఐఐటీలూ భాగస్వాములే..

వెబ్ సైట్ మొదలై ఏడాది కాకపోయినా సమాచారం బాగుండటంతో దీనికి బాగా పేరొచ్చింది. దాంతో వందలాది కళాశాలలు తమ సమాచారం పంచుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చాయి. అందులో ప్రతిష్ఠాత్మక ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్, ఎన్.ఐ.టి. రూర్కీ, ఎన్.ఐ.టి. సిల్చార్, ఎన్.ఐ.టి. దుర్గాపూర్‌లు కూడా ఉండటం విశేషం. ఇవి కాకుండా ఐఐటీ బొంబాయి, ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ కాన్పూర్‌లు.. ఎన్.ఐ.టి.లు, ట్రిపుల్ ఐటీలు మీడియా భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు ఈ వెబ్ సైట్‌కి దాదాపు 20 లక్షల మంది వీక్షకులున్నారని అంచనా. ప్రతి నెలా మూడు లక్షల క్లిక్స్ కొత్తవారి నుంచి వస్తున్నాయి. ముగ్గురు మిత్రులూ వేర్వేరు చోట్ల ఉంటున్నా, ఎప్పటికప్పుడు సమన్వయంతో వెబ్ సైట్‌ను నిర్వహిస్తూ తీర్చిదిద్దుతుండడం విశేషం.

**ఆ కుర్రాళ్లే దేవేంద్ర, హేమంత్, నవీన్.**

## మొదలైందిలా..

ముగ్గురు మిత్రుల సొంతూరు రాజస్థాన్‌లోని సవాయ్ మాధ్‌పూర్. చిన్నప్పటి నుంచి ఏ ఆలోచనైనా కలిసి పంచుకోవడం వారికలవాటు. దేవేంద్ర ఎన్.ఐ.టి. జైపూర్ నుంచి ఇంజినీరింగ్, ఘజియాబాద్‌లో ఎంబీఏ పూర్తి చేస్తే, హేమంత్ ఐఐటీ మద్రాస్ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. నవీన్ సింహగఢ్ బిజినెస్ స్కూల్, పుణే నుంచి ఎంబీఏ చేశాడు. దేవేంద్రకిష్టమైన సబ్జెక్టు మెటలర్జీ. దీంట్లోనే కెరీర్ మొదలు పెట్టాలనుకున్నా ఉద్యోగ అవకాశాలు ఎక్కడున్నాయో తెలియదు. సమాచారం ఎవరిస్తారో తెలియదు. అందుకే వచ్చిన ఉద్యోగంలో చేరిపోయాడు. హేమంత్ ఐఐటీ మద్రాస్ విద్యార్థి. ప్రాజెక్టు పనిమీద కొన్నాళ్లు లండన్‌లో ఉన్నాడు. ఉన్నతవిద్యలో అక్కడున్న నాణ్యత ప్రమాణాలు ఇక్కడ లేవని గ్రహించాడు. నవీన్ పుణేలో ఎంబీఏ పూర్తి చేసి అక్కడే ఓ కన్సల్టింగ్ కంపెనీ నిర్వహిస్తుండేవాడు.

తనలా ఇష్టంలేని ఉద్యోగంలో ఎవరూ చేరకూడదని దేవేంద్ర కోరిక. అందుకోసం దేశంలోని ఉద్యోగ సమాచారాన్నంతా ఒకచోటికి చేర్చాలనుకున్నాడు. అత్యుత్తమ ప్రమాణాలున్న కళాశాలల వివరాలు విద్యార్థులకు తెలియజేయాలని హేమంత్ తపన. తనకిష్టమైన ఆన్‌లైన్ ద్వారా స్టూడెంట్స్‌కి సాయం చేయాలని నవీన్ కోరిక. అలా ముగ్గురి ఆశయాల కలబోతగా తయారైందే కాలేజ్‌కబర్. కిందటేడు ఆగస్టులో మొదలైన ఈ వెబ్ సైట్‌కు వాళ్లు సొంతంగా పెట్టిన పెట్టుబడి రూ.70 వేలు.

## సమాచార 'కబరీ'లు

వెబ్ సైట్ మొదలైంది, ఉద్దేశం బాగానే ఉంది. కానీ 'సమాచారం అందించేవారు ఎవరు?' మిత్రుల్లో ఆలోచన మొదలైంది. దానికి పరిష్కారమే 'క్యాంపస్ పార్ట్‌నర్' (కబరీ). కళాశాలల నుంచే కొందరు కుర్రాళ్లను ఎంపిక చేశారు. తామేం చేయాలనుకుంటున్నామో వాళ్లకు వివరించారు. కోర్సుల నుంచి క్యాంపస్ నియామకాల దాకా ఎలాంటి వివరాలైనా పంపొచ్చని కోరారు. చాలా మంది ఆసక్తిగా విన్నా ఫలితం అంతంతమాత్రమే. మొదట్లో పెద్దగా ఆసక్తి చూపలేదు. దాంతో మెరుగైన వివరాలు పంపేవారికి బహుమానాలుంటాయని ప్రకటించడంతో స్పందన మొదలైంది. ఆపై ఉత్సాహవంతులు దీని ప్రాధాన్యతను గుర్తించి సమాచారం పంపసాగారు. అలా అలా వివరాలు వెల్లువెత్తాయి. ఇప్పుడు ఈ వెబ్ సైట్‌కి దేశవ్యాప్తంగా వెయ్యిమందికి పైగా కబరీలున్నారు.

## వెబ్‌సైట్ ఉద్దేశం

దేశంలోని ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కాలేజీల ప్రవేశాలు, క్యాంపస్ నియామకాలు, వివిధ పరీక్షల ఫలితాలు ఎప్పటికప్పుడు పొందుపరచడం ఈ వెబ్ సైట్ ఉద్దేశం. ఎక్కడెక్కడి విద్యార్థులైనా సరే వెబ్ సైట్లోకి వెళితే చాలు చక్కని సమాహారంలాగా సమాచారం కనిపించేలా తీర్చిదిద్దారు. వివరాలు తెలపాలన్నా, సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నా వెబ్ సైట్లో సభ్యుడిగా నమోదు కావాలి. సభ్యత్వం ఉన్నవాళ్ల కోసం ప్రత్యేకంగా కొన్ని సూచనలిచ్చే బృందాలుంటాయి. మొత్తంమీద ఇప్పటికి మూడు వేల మంది సభ్యులయ్యారు. వీరు మౌఖిక పరీక్షలో విజయం సాధించడానికి అవసరమయ్యే సమాచారం సైతం అందుబాటులో ఉంటుంది. వీటితో పాటు ఈ వెబ్ సైట్‌లో పనితీరును బట్టి ఐఐటీ, ఎన్ఐటీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కాలేజీలకు ర్యాంకింగ్‌లు కేటాయిస్తున్నారు. వీటి ఆధారంగా తమకు నచ్చిన కళాశాలల్లో చేరొచ్చు.